సాక్షి చిత్తూరు

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



ఆంక్షలు.. అడ్డంకులు

కుప్పంలో అన్నదాత పోరుకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. సవాలక్ష ఆంక్షలు విధించారు.

- 8లో



నాట్యమయూరి

చౌడేపల్లి మండలంలో నెమళ్లు నాట్యమాడుతూ ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

- 8లో



సకాలంలో వైద్యం అందించాలి

ఆస్పత్రికి వచ్చే గ్రామీణ రోగులకు సకాలంలో వైద్యం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు.

- 8లో

అన్నదాత పోరుబాట!

పలమనేరు ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీచైర్మన్, మాజీ ఎమ్మెల్యే



జిల్లాలో అన్నదాతలు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. ఏడాదిన్నరగా ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనలు మిన్నంటించారు. వరి, వేరుశనగ, మామిడి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి నేతలు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఎన్నడూ లేని విధంగా యూరియా కొరతతో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వచ్చిన ఎరువులను కొందరు నేతలు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేశారు. 'కక్ష సాధింపు మానుకో.. గిట్టుబాటు ధరలిచ్చుకో..!,' 'నాటకాలు ఆపు..ఎరువులివ్వు బాబూ'! అంటూ నినాదాలు మిన్నంటించారు. అనంతరం ఆర్డీఓలకు వినతి పత్రాలు సమర్పించారు.

పలమనేరులో ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



సమస్యలపై కదంతొక్కిన రైతన్నలు

- వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పలమనేరులో భారీ ర్యాలీ
- హోరెత్తిన నినాదాలు
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అన్నదాతలు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. సరైన విత్తనాలు.. చాలినంత ఎరువులు అందక అష్టకష్టాలు పడుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా యూరియా కొరత మెడకు చుట్టుకోవడంతో గిజగిజా కొట్టుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎర్రటి ఎండనూ లెక్కచేయక ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఇన్ని అవస్థలు పడుతున్నా కూటమి నేతలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై అన్నదాతలు రగిలిపోతున్నారు.
వీరికి అండగా వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు'కు పిలుపునిచ్చింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలమనేరు, కుప్పం, చిత్తూరు, నగరి ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. రెవెన్యూ డివిజనల్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా నియంత్రించాలని కోరారు. వేరుశనగ, వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని, పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని సూచించారు.



నగరిలో అన్నదాత పోరులో మాజీ మంత్రి ఆర్కే రోజా (ఇన్‌సెట్) ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

కుప్పంలో ఆంక్షల జోరు

ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని రైతు సమస్యలను పరిష్కరించాలని అధికారికి వినతి పత్రం సమర్పించారు. పార్టీ శ్రేణులు, రైతులు నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు అడ్డుకున్నారు. 30 యాక్ట్ అమలులో ఉందని, ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని సోమవారం రాత్రే ఆంక్షలు విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీచేశారు. కేవలం ఐదుగురు.. లేదా ఆరుగురితో ఆర్డీఓ కార్యాలయాలకి చేరుకుని వినతి పత్రం సమర్పించాలని హుకుం జారీచేశారు. ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం సమర్పించారు.

చిత్తూరులో అడ్డగింపులు

చిత్తూరులో ర్యాలీలు, నిరసన చేపట్టకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. అయితే పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ చేపట్టేందుకు పూనుకున్నారు. మాజీ మంత్రి నారాయణస్వామి, చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొని అన్నదాతలకు మద్దతుగా నిలిచారు. అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా గంగినేని చెరువు నుంచి చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు.

నిరసనలతో గర్జించిన నగరి

నగరిలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యర్తలు, రైతులు కలిసి ర్యాలీ నిర్వహించారు. రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అన్నదాతలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు.

హోరెత్తిన పలమనేరు

పలమనేరులో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేగౌడ్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సిల్క్ ఫాం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం వరకు సాగింది. రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల నినాదాలతో పలమనేరు పట్టణం హోరెత్తింది. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివచ్చారు.

బాబొస్తే కన్నీరే

చంద్రబాబు ముఖ్యమంత్రిగా గడిచిన నాలుగు దఫాలు ఎప్పుడైనా రైతులు సంతోషంగా ఉన్నారా..?. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ వారికి కన్నీళ్లే. పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఉండదు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా ఊసేలేదు. కనీసం యూరియా దిక్కులేని పాలన కేవలం చంద్రబాబుకే దక్కింది. యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన ఘనత కూటమి సర్కార్‌కే చెల్లుతుంది. యూరియా ఎక్కువ వాడితే భూసారం దెబ్బతింటుందని చంద్రబాబు ఉచిత సలహాలు ఎవరికోసం గుప్పిస్తున్నాడో రైతులు గుర్తించాలి. కేవలం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులకు గిట్టుబాటు ధరలేక పలువురు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎదురైంది. ఈ ప్రాంతంలో టమాటాకు రేట్లు లేక రోడ్డుపాలు చేసిన ఘటనలు చూశాం గానీ ఎప్పుడైనా మామిడిని రోడ్డుపై పడేశారా..?. గత ప్రభుత్వంలో కోవిడ్‌లాంటి కష్ట సమయంలోనూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. **- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే**



చిత్తూరులో ర్యాలీగా వెళ్తున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణ స్వామి, చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు సమన్వయకర్తలు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, కృపాలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి



ఎస్సార్‌పురం మండలంలో మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి



చిత్తూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ డెప్యూటీ సీఎం, సమన్వయకర్తలు



కుప్పం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రైతు సంక్షేమం పట్టదా?

గత ఐదేళ్ల జగనన్న పాలనలో రైతులు ఏనాడూ సమస్యలపై రోడెక్కలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏడాదిన్నరకే అష్టకష్టాలు అనుభవిస్తున్నారన్నారు. నాడు గిట్టు బాటు ధర లేక రోడ్డెక్కితే నేడు రాష్ట్రంలోని రైతులందరూ ఎరువులు, యూరియా లేక రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని రైతులను, వారికి అండగా నిలబడే వైఎస్సార్‌సీపీ నేతలను కేసులు పెడతామంటూ బెదిరింపులకు గురిచేస్తోంది. ఎరువులు, యూరియా పుష్కలంటే ఉంటే రైతులు మండుటెండల్లో ఎందుకు క్యూలో నిలబడతారు. చంద్రబాబు, పవన్‌కు రైతు సంక్షేమం పట్టదా..?. **- ఆర్కే రోజా, మాజీ మంత్రి**

క్యూలో నిలబడితే తప్పలేదంట

గత పాలనలో విత్తనం ఎంపిక నుంచి పంట విక్రయించే వరకు అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆర్‌బీకేల ద్వారా ప్రతి రైతుకూ అవసరమైన సాంకేతికతను అందించడంతో పాటు అన్ని రకాలైన ఎరువులు వారికి అందుబాటులో తెచ్చారు. ఎరువులు ఎంత కావాలో కూడా అంచనా వేయలేని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులు క్యూలో నిలబడి ఎరువులు కొనుగోలు చేస్తే తప్పేమిటని అనడం సరికాదు. యూరియా వాడితే రోగాలు వస్తాయని చెప్పడం రైతులు, శాస్త్రవేత్తలను అవమానించినట్లే అవుతోంది. **- నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం**

అన్నదాతలకు అన్యాయం

గతేడాది పంటలు దెబ్బతింటే ఇప్పటి వరకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేదు. ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులను అందించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. మండుటెండలో రైతులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినప్పటికీ ఎరువులు దొరకడం లేదు. రైతులను పట్టించుకోకుండా కూటమి నాయకులు సంపాదనపై మాత్రమే కన్నేశారు. ఇప్పటి వరకు జిల్లాలో మామిడి రైతుల ఖాతాల్లో గిట్టుబాటు ధర జమచేయని దుస్థితి నెలకొంది. **- సునీల్‌కుమార్, సమన్వయకర్త, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే**

రైతులు నరకం చూస్తున్నారు

గత పాలనలో వరదల్లో పాడైన పంటలను సైతం ప్రభుత్వం కోనుగోలు చేసింది. ప్రస్తుతం నాణ్యమైన పంటను కొనడానికి కూడా కూటమి ప్రభుత్వం సిద్ధంగా లేదు. మిర్చి, పొగాకు, మామిడి పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. కష్టపడి పండించిన పంటను రైతులు రోడ్డు పై పారబోసే దుస్థితికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలో అర్థభాగం కూడా ప్రభుత్వం, ఫ్యాక్టరీలు ఇవ్వడం లేదు. ఇప్పుడు కొత్తగా యూరియా కొరత వచ్చింది. యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. **- ఎంసీ.విజయానందరెడ్డి, సమన్వయకర్త, చిత్తూరు నియోజకవర్గం**

కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు

కూటమి ప్రభుత్వం ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆర్థికంగా దోచుకుంటున్నారు. ఏ ఒక్క పథకాన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ఎరువులు ఎవరికి ఎంతెంత ఇచ్చారో ఇన్వాయిస్‌లను ప్రకటించాలి. అధికార పార్టీ మద్దతుదారులకే ఎరువులు ఇవ్వడం సరికాదు. విద్యను ఎలాగో ప్రోత్సాహించడం లేదు. కనీసం అందరికీ అన్నం పెట్టే రైతులకు ఎరువులు, మద్దతు ధర ఇచ్చి ఆదుకోండి. **- కృపాలక్ష్మి, నియోజకవర్గ సమన్వయకర్త, గంగాధరనెల్లూరు నియోజకవర్గం.**

న్యూస్‌రీల్

నేడు రెడ్ రన్ మారథాన్

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ.. బుధవారం చిత్తూరులో రెడ్ రన్ మారథాన్‌ను నిర్వహించనున్నట్టు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఉదయం 6 గంటలకు మెసానికల్ మైదానం నుంచి ఈ రన్ ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులు అర్హులని, రన్‌లో ప్రతిభ కనబరచిన వారికి నగదు బహుమతి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు మెసానికల్ మైదానం వద్దకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పంటలు ధ్వంసం



చల్లావారిపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లె, పాతపేట పంచాయతీల్లో మంగళవారం తెల్ల వారు జామున ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి ధ్వంసం చేసింది. పది రోజులుగా వరస బెట్టి ఒకే ప్రాంతంలో ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయి. చల్లావారిపల్లెలో మొక్కజొన్న పంటను తిని తొక్కి నాశనం చేశాయి. అలాగే పనస, మామిడి, అరటి, వేరుశనగ పంటలను ధ్వంసం చేశాయి. ఏనుగుల బారినుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

యూరియా పంపిణీ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి, కొళత్తూరు, వీరప్పల్లి రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌ఎస్‌కేల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ–కేవైసీ, బయోమెట్రిక్‌తో డీబీటీ పద్ధతిలో పారదర్శకంగా రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు మరొక బస్తా పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. అవసరమైన చోట 20 రోజుల తర్వాత మరో విడత యూరియా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏడీఏ శివకుమార్, ఎంపీడీఓ బాలాజీ, ఏఓ హేమలత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

యూరియా కొరత లేదు

పుంగనూరు: ప్రస్తుతం ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులందరికీ సరఫరా చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని యూరియా గోడౌనును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించారు. లక్ష్యాన్ని మించి యూరియాను సరఫరా చేస్తున్నామని, వ్యవసాయాధికారుల సూచనల మేరకే యూరియా వినియోగించాలని సూచించారు. కలెక్టర్ వెంట జేడీ మురళీకృష్ణ, ఏడీ శివకుమార్ ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం జరగాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి ఆదేశించారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం జననీ సురక్ష యోజన పథకంపై వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. హైరిస్క్ కేసులకు అందించే వైద్య సేవల విషయంలో ఎలాంటి లోటు ఉండకూడదన్నారు. ప్రతి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికీ జననీ సురక్ష కింద అర్బన్ ప్రాంతాల వారికి రూ.800, రూరల్‌కు రూ.1000 చొప్పున్న డీబీటీ ద్వారా ఇవ్వాలన్నారు. అలాగే ఎన్‌హెచ్‌ఎం ఫండ్స్‌పై చర్చించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, వైద్యులు రోజారాణి, రామ్మోహన్, వైద్యులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ భరణి బదిలీ



సుబ్బరాజు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఫ్‌ఎస్‌ల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా డీఎఫ్‌ఓ భరణి బదిలీ అయ్యా రు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భరణిని శాప్ ఎండీగా బదిలీ చేయగా.. ఆమె స్థానంలో జిల్లాకు 2022 బ్యాచ్‌కు చెందిన కోడూరు సబ్‌డీఎఫ్‌ఓగా ఉన్న సుబ్బురాజును నియమించారు.

పలుకుబడి ఉన్నోళ్లకే యూరియా



యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు


యాదమరి: 'మీరిచ్చే ఒక్క బస్తా యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్నాం. కానీ మీరేమో గుట్టుచప్పుడు కాకుండా రాజకీయంగా పలుకుబడి ఉన్నోళ్లకే బినామీ టోకెన్లు జారీచేసి ఇచ్చేస్తున్నారు. అడిగితే స్టాకు లేదని అంటున్నారు. ఇదెక్కడి న్యాయం' అని పలువురు రైతులు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ ఘటన మంగళవారం మోర్దానపల్లి రైతు సేవా కేంద్రం వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం మండల పరిధిలోని మోర్దానపల్లి రైతు సేవా కేంద్రానికి 300 బస్తాల యూరియా వచ్చింది. దీని కోసం రైతులు ఉదయం 7 నుంచే క్యూలో వేచి ఉన్నారు. అయితే ఎప్పటిలాగే ఆర్‌ఎస్కే సిబ్బంది 11 గంటలకు వచ్చారు. అప్పటికే ఆకలితో అలమటిస్తున్న అన్నదాతలు సిబ్బంది ధోరణిపై అసహనానికి గురయ్యారు. రాజకీయ పలుకుబడి ఉన్నవాళ్లకి దొడ్డిదారిన యూరియా అందించడంతో, ఇది గమనించిన రైతులు ఓ మహిళా సిబ్బందిని ప్రశ్నించారు. ఒకానొక దశలో ఆ మహిళా ఉద్యోగితో తీవ్ర వాగ్వాదం ఏర్పడింది. మండలంలో రెండు నెలల కిందట వేరుశనగ విత్తనాల పంపిణీ సమయంలో కూడా ఆ మహిళా ఉద్యోగి రైతులపై దురుసుగా ప్రవర్తించినట్టు అక్కడి రైతులు పేర్కొన్నారు. కాగా వచ్చిన 300 బస్తాల యూరియాలో మోర్దానపల్లి, యాదమరి, కీనాటంపల్లి, వరదరాజులుపల్లి, 14కండ్రిగ, కోనాపల్లి పచాయతీల నుంచి 222 మంది అన్నదాతలకు ఒక్కో బస్తా చొప్పున అందించారు. మిగిలిన 78 బస్తాలను బుధవారం మాధవరం, జంగాలపల్లి పంచాయతీలోని రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏఓ దీప చెప్పారు.

సూర్యప్రభపై అభయం

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి మంగళవారం సూర్యప్రభ వాహనంపై అభయమిచ్చారు. ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తునలు ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం స్వామిని మంగళవాయిద్యాల నడుమ మూడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు చంద్రప్రభ వాహన సేవ

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ మూర్తులు బుధవారం చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతూ కటాక్షించనున్నారు. ఉదయం అభిషేకం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ ఉంటుందని ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు.




సూర్యప్రభ వాహనంపై స్వామివారు

అలరించిన నాట్యం

శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. నాటక, గీతాలపానలు, కూచిపూడి, భరతనాట్యం కళాకారుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ధార్మికోపనాస్యం, హరికథ ఆకట్టుకుంది.



అలరించిన కళాకారిణి



క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి రూ.1.1 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.1 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అంతర్జాతీయ క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

కుప్పం: ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. అంతర్జాతీయ క్రీడలకు మంగళవారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నేపాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు.

పీఈఎస్ విద్యార్థికి బహుమతి



బహుమతి అందుకుంటున్న విద్యార్థి సాయి జాహ్నవి

గుడుపల్లె: మండలంలోని పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న సాయి జాహ్నవికి విశిష్ట బహుమతి లభించింది. హెల్త్ యూనివర్సిటీ 2023లో నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో సత్తా చాటింది. ఇందుకు గాను ప్రతిష్టాత్మక కవూరి హైమావతి, కవూరి చలపతిరావు బహుమతి జాహ్నవికి లభించింది. విజయవాడలో మంగళవారం నిర్వహించిన హెల్త్ యూనివర్సిటీ వార్షికోత్సవంలో విద్యార్థి సాయిజాహ్నవికి బహుమతి ప్రదానం చేశారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందాలంటే టెట్ తప్పనిసరి అని ఆదేశించిన సుప్రీం తీర్పుపై కూటమి ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు మరింత క్లిష్టమవుతాయన్నారు. 20 ఏళ్లకు పైగా పనిచేసిన టీచర్లు ఇప్పుడు టెట్ అర్హత సాధించడం అన్యాయమని, కష్టతరమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రకటించిన దసరా సెలవుల్లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు.

సీబీఐతో విచారణ జరిపించాలి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి నాయకుల అవినీతి, అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల దోపిడీకి అడ్డులేకుండా పోతోందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని ఆరోపించారు. పలువురు తమిళనాడు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్రమంగా క్వారీల నిర్వహణ, గ్రావెల్, ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని చెప్పారు. వీటిపై పత్రికలు, మీడియాలో కథనాలు వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

ఆంక్షలు.. అడుగడుగునా ఆటంకాలు

- కుప్పంలో అన్నదాత పోరును అడ్డుకునేందుకు పోలీసుల కుయుక్తులు
- ఎవరూ రాకుండా అడ్డుకునే యత్నం



మున్సిపల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, కౌన్సిలర్ హఫీజ్, మోహన్ రామ్‌ను అడ్డుకున్న పోలీసులు

కుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత తీర్చాలని వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కుప్పంలో నిర్వహించిన అన్నదాత పోరుకు పోలీసులు ఆంక్షలతోపాటు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధమయ్యారు. కుప్పం నియోజకవర్గంలో ర్యాలీలకు అనుమతులు లేవని, ఆర్డీఓకు వినతి పత్రాన్ని ఇచ్చేందుకు కేవలం ఐదుగురికి మాత్రమే అనుమతిస్తున్నట్టు కుప్పం డీఎస్పీ పార్థసారథి సోమవారమే తేల్చారు.

భారీగా పోలీసుల మోహరింపు

అన్నదాత పోరు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎమ్మెల్సీ, కుప్పం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భరత్ క్యాంపు కార్యాలయం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పోలీసులు ప్యాలెస్ రోడ్డు, క్యాంపు కార్యాలయం వద్ద మోహరించారు. వైఎస్సార్ సీపీ కేడర్‌ను రానివ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్సీ క్యాంపు ఆఫీసు వద్ద కుప్పం అర్బన్ సీఐ, ఇద్దరు ఎస్ఐలు, పోలీసు యంత్రాంగం తిష్టవేసింది.

దారి పొడువునా అడ్డగింత

కుప్పం నుంచి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆర్డీఓ కార్యాలయానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను దారి పొడవునా పోలీసులు అడ్డగించారు. అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి అనుమతులు లేవని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ అర్బన్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ హఫీజ్, మోహన్ రామ్‌ను శెట్టిపల్లి వద్ద నిలిపివేశారు. అదేవిధంగా గుడుపల్లె మండలం, కుప్పిగానిపల్లి సర్పంచ్ రామూర్తిని వంద పడకల ఆస్పత్రి సర్కిల్ వద్ద నిలిపివేశారు.

అక్రమాలకు పాల్పడితే.. 'బుక్'అయిపోతారు!

- పొదుపు సంఘాల్లో పలు అక్రమాలు
- ప్రత్యేక యాప్‌తో అడ్డుకట్టకు చర్యలు





పొదుపు సంఘాలకు ప్రత్యేక యాప్ చిత్రం, పొదుపు సంఘాల గ్రూపు నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పొదుపు సంఘాల్లో నిత్యం ఏదో ఒక చోట అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని పొదుపు సంఘాలు అక్రమాలకు పాల్పడి నగదు కొట్టేస్తున్న ఘటనలు తలెత్తుతున్నాయి. ఇలా అక్రమాలకు పాల్పడే పొదుపు సంఘాలపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అటువంటి పొదుపు సంఘాల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, స్వయం సహాయక సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. మొబైల్ బుక్ కీపింగ్ యాప్ (మన డబ్బులు–మన లెక్కలు) పేరుతో యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను డీఆర్‌డీఏ శాఖ జిల్లాలోని పొదుపు సంఘాలకు అందుబాటులోకి తీసుకొచ్చింది.

మొదటి నుంచి పుస్తకాల్లోనే వివరాలు

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపులో చేరినప్పటి నుంచి పుస్తకాల్లోనే వివరాలను నమోదు చేస్తున్నారు. ఇకపై అలాంటి పద్ధతికి అవకాశం లేకుండా యాప్‌లో నగదు లావాదేవీలన్నీ నమోదు చేసేలా అవకాశం కల్పించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో సభ్యులు పొదుపులో చేరినప్పటి నుంచి పుస్తకాల్లో నమోదు చేసిన సమగ్ర వివరాలను నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..!

- యాప్‌లో నమోదైన అనంతరం, స్వయం సహాయక సంఘానికి, సభ్యులకు కేటాయించిన ప్రత్యేక ఐడీల ద్వారా ఆర్థిక లావాదేవీలు సులువుగా తెలుసుకోవచ్చు
- ప్రతి నెలా పొదుపు, రుణ చెల్లింపుల నిమిత్తం వెలుగు సిబ్బందికి ఇచ్చిన నగదు బ్యాంకులో జమ చేశారా? లేదా ? అనే వివరాలను తెలుసుకునే వెసులుబాటు. సంక్షిప్త సందేశంతో సహా వాయిస్ మెసేజ్‌ను సైతం పొందవచ్చు.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు

నియోజకవర్గం	గ్రూపుల సంఖ్య
చిత్తూరు	500
గంగాధరనెల్లూరు	1,881
కుప్పం	2,171
నగరి	1,404
పలమనేరు	2,475
పుంగనూరు	1,791
పూతలపట్టు	2,316
మొత్తం	11,538

అభ్యంతరాలకు అవకాశం



ఈ ఏడాది మార్చి 31 వరకు సంఘాలు, వాటిలోని సభ్యుల పొదుపు, బ్యాంకుల నుంచి పొందిన రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి వివరాలన్నీ యాప్‌లోనే నమోదు చేస్తారు. వాటి ఆధారంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు సైతం యాప్‌లో కనిపిస్తాయి. ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే యాప్‌లోనే ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. – శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ, చిత్తూరు జిల్లా

11 నుంచి డైట్‌లో కళా ఉత్సవ పోటీలు



కళాఉత్సవ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డైట్ అధ్యాపకులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో 11, 12 తేదీల్లో భారతీయ సంస్కృతి, సంప్రయాల వారసత్వ కళలపై (కళాఉత్సవ్) పోటీలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ బీ.వరలక్ష్మి తెలిపారు. మంగళవారం డైట్ కళాశాల ఆవరణలో ఉళాఉత్సవ్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీలలో 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు సంస్కృతి కళలపై కళాఉత్సవ్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. అనంతరం కళాఉత్సవ్ ఇన్‌చార్జి ఎస్.రంజిత్‌కుమార్ మాట్లాడతూ 11న గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం నృత్యం విభాగాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. 12న థియేటర్స్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ సంప్రదాయ కథకథనం విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా 8801718082 నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డీకే దామోదర్‌రావు, మోహన్‌రెడ్డి, నాగరాజునాయక్, సూపరింటెండెంట్ కృపావతి పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి



శిక్షణ అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో డీపీఓ

పూతలపట్టు(యాదమరి): పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి(2.0)పై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన వనరులను అన్వేషించాలన్నారు. పొడి, తడి చెత్తను వేరు చేసి అందులో నుంచి వర్మీకంపోస్టును తయారు చేసి, వాటిని రైతులకు విక్రయించాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు

ఏ.కొత్తకోటలోనే రైతుసేవా కేంద్రం కొనసాగించాలి



చౌడేపల్లెలో ఏఓ మోహన్‌కుమార్‌కు విన్నవిస్తున్న ఏ.కొత్తకోట రైతులు

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట గ్రామంలోనే రైతుసేవా కేంద్రాన్ని కొనసాగించాలని రైతులు ఏవో మోహన్‌కుమార్‌ను వేడుకున్నారు. గత ప్రభుత్వంలో రైతుల శ్రేయస్సు కోసం తమ గ్రామంలోనే రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల దుర్గసముద్రం రైతు సేవా కేంద్రానికి ఏ.కొత్తకోటను అనుసంధానం చేస్తూ మ్యాపింగ్ చేయడం తగదన్నారు. రెండు రోజుల క్రితం ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న దుర్గసముద్రం రైతు సేవా కేంద్రానికి వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. రైతులు విజయ్‌కుమార్‌రెడ్డి, షఫీ, మునిరాజ, మల్లికార్జున పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందించాలి

పుంగనూరు: ఏరియా ఆస్పత్రిలో గ్రామీణ ప్రజలందరికీ సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, వైద్యులు, నర్సుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ హరగోపాల్, డాక్టర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు ప్రజలకు అందిస్తున్నట్టు వెల్లడించారు.

ఫొటో, వీడియోగ్రఫీలపై ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ , గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 15వ తేదీ (సోమవారం) నుంచి 31 రోజుల పాటు పురుషులు, మహిళలకు ఫొటో, వీడియోగ్రఫీపై ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ , రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆ సంస్థకే యూరియా కేటాయించాలి



మాట్లాడుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘ మండల అధ్యక్షుడు వెంకటరమణ

చౌడేపల్లె: రైతు ఉత్పత్తిదారుల సంస్థకే యూరియా కేటాయించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల సంఘ మండల అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో రైతులు, డైరెక్టర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఉత్పత్తిదారుల సంఘం పరిధిలో 2,315 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, వరి, గడ్డి సేద్యం సాగు కోసం ప్రతి రైతుకూ యూరియా అవసరమని చెప్పారు. ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న యూరియాలో కొంతమేరకు మాత్రమే సరిపోతోందని, ఇంకనూ యూరియా అవసరం ఉందని సమావేశంలో తీర్మానించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా యూరియా కొనుగోలుకు ముందస్తుగానే సొమ్ము చెల్లిస్తామని, ఉన్నతాధికారులు స్పందించి యూరియా మంజూరుచేస్తే రైతులకు పారదర్శకంగా పంపిణీ చేస్తామని చెప్పారు. సమావేశంలో డైరక్టర్లు కృపాకర్‌రెడ్డి, కృష్ణప్ప పాల్గొన్నారు.

ఆరోపణల వెనుక కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్పీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర పాలక సంస్థ మెప్మా అధికారిగా పనిచేసిన రమణ పోద్బలంతో మహిళా సంఘాల సభ్యుల పేరిట భువనేశ్వరి, ఉషారాణి అనే ఇద్దరు మహిళలు తనపై నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు నగర పాలక సంస్థ రిసోర్స్ పర్సన్ బేబీ శ్వేత ఆరోపించారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను 38 గ్రూపులకు ఆర్పీగా పనిచేశానని, తమ గ్రూపులోని సభ్యులు ఎవరూ ఆరోపణ చేయలేదన్నారు. సభ్యులు కాని వారు ఫిర్యాదు చేయడం వెనుక కుట్ర ఉందన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మెప్మా అధికారి రమణ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఆయనపై ఫిర్యాదు చేసినందుకు కక్ష సాధింపుగా ఇలా లేనిపోని ఆరోపణలను చేస్తున్నట్టు తనకు సమాచారం ఉందన్నారు. తన భర్తకు ఈ వ్యవహారానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ ఘటనతో తమ పిల్లలు ఎంతో మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన చెందారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని ఆమె పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలు మూకుమ్మడిగా మూసివేస్తాం



మాట్లాడుతున్న పట్నం సురేంద్రరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మూకుమ్మడిగా మూసివేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ ఉపాధ్యక్షులు పట్నం సురేంద్రరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. అయితే ఎటువంటి స్పందనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదిన్నర సంవత్సరంగా కరస్పాండెంట్లు అప్పులు చేసి కళాశాలలు నిర్వహిస్తున్నారని చెప్పారు. స్కాలర్‌షిప్‌ల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 2023–24, 2024–25 విద్యాసంవత్సరాల పెండింగ్ ఆర్‌టీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. డిగ్రీ కోర్సు ఫీజులను సవరించి కొత్త ఫీజు విధానం ఆయా యూనివర్సిటీలకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

గ్రామంలో లేని మహిళకు ఆశా కార్యకర్త పోస్టు



చౌడేపల్లెలో డాక్టర్ మోనాను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లె: మండలంలోని పెద్ద యల్లకుంట్ల పంచాయతీ పరిధిలో గ్రామంలోని మహిళను ఆశా కార్యకర్తగా నియమించడంపై గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తులందరూ కలిసి మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యురాలు మోనాను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఆశ కార్యకర్తగా ఉన్న లక్ష్మీదేవి మృతిచెందడంతో ఆ పోస్టుకు ఆరుగురు మహిళలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అయితే నిబంధనలు పాటించకుండా పక్క పంచాయతీలో నివాసమున్న మహిళకు పోస్టు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రూ.30 లక్షల విలువ చేసే టపాకాయలు సీజ్



పుంగనూరులో పోలీసులు సీజ్ చేసిన టపాకాయలు

పుంగనూరు: టపాకాయల నిల్వలపై చిత్తూరు ఎస్‌బీ అధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి, సుమారు రూ.30 లక్షల విలువ చేసే టపాకాయలను సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టపాకాయల వ్యాపారి డీష్ బాబు, శ్రీధర్‌గుప్తా, రాఘవేంద్ర సప్లయర్స్ వారు అనుమతులు లేకుండా సుమారు రూ.30 లక్షల విలువ చేసే టపాకాయలను నిల్వ చేసి ఉండడంపై ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. సీఐ సుబ్బరాయుడు, పోలీసులతో కలసి దాడులు చేసి, టపాకాయలను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు.

చిత్తూరులో బాణసంచా సీజ్

– ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బాణసంచాతో పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో అనుమతుల్లేకుండా తరలుతున్న బాణసంచా వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. మంగళవారం సాయంత్రం చిత్తూరు–బెంగళూరు జాతీయ రహదారిపై టూటౌన్ సీఐ నెట్టికంటయ్య ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ మినీ లారీని తనిఖీ చేయగా.. తమిళనాడులోని శివకాశి నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాలకు 70 బాక్సుల్లో బాణసంచా తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.4 లక్షలు ఉంటుందని అధికారులు గుర్తించారు. బాణసంచాతో పాటు వీటిని తరలిస్తున్న మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ఎం.రవికుమార్, యాదమరికి చెందిన మణిగండన్ అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సిబ్బంది సుధీర్, బాబురెడ్డి, బాబు, రాజేష్, సుబ్రమణ్యం, బాషా, నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై 'నిరసన వారం'

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై ఏపీటీఎఫ్ 'నిరసన వారం' కార్యక్రమాన్ని చేపడుతోందని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు వివిధ విధానాల్లో నిరసనలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నాట్య మయూరి



చౌడేపల్లె మండలంలోని చారాల పంచాయతీ బీర్జేపల్లెలోని పెద్దరెడ్డెప్ప ఇంటి వద్ద మంగళవారం నెమళ్లు నాట్యామాడుతూ ప్రకృతి, జంతు ప్రేమికులను అలరించాయి. ఇటీవల కాలంలో అటవీ ప్రాంతాల నుంచి నెమళ్లు, అడవీ జంతువులు జనసంచారంలోకి చేరుతున్నాయి. ఇండ్లపైకి ఎక్కడంతోపాటు పరిసర ప్రాంతాల్లోకి చేరి ప్రజలు వేసిన ఆహారాన్ని తింటూ కనువిందు చేస్తున్నాయి. మంగళవారం ఓ నెమలి పురివిప్పి నాట్యమాడుతూ విశేషంగా ఆకట్టుకుంది. – చౌడేపల్లె